క్లుప్తంగా

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ఉదయం వాకింగ్‌కు వెళ్లి బయటకు వచ్చి చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికి పట్టాభిపురం పోలీసులకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉద్యోగనగర్ ప్రాంతానికి చెందిన ఆలూరి తిరేష్ వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. నవంబరు 21న రోజు మాదిరిగానే గుజ్జనగుండ్లలోని వాకింగ్ ట్రాక్ వెళ్లి వాకింగ్ చేసుకునేందుకు బండి పార్కింగ్ చేసి వాకింగ్ పూర్తి చేసుకుని బయటకు వచ్చి చూసేసరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అనారోగ్య కారణాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతగుంటూరులోని లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే పేర్న ఏడుకొండలు (55) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

8న పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పోటీలు

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామ నామ క్షేత్రంలో 98వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 8న పాఠశాల స్థాయి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.లీలా సుందరి, మస్తాన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లలోపు విద్యార్థులకు దాశరథి శతకంలో 46- 60 పద్యాల వరకు, కంఠస్థ పాఠవ పోటీలు 10- 15 ఏళ్ల లోపు వారికి భగవద్గీత మూడో అధ్యాయంలోని (కర్మయోగం) ఒకటి నుంచి 21వ లోకాల వరకు, తులసీదాసు విరజిత హనుమాన్ చాలీసా కంఠస్థ పోటీలు, 15 ఏళ్ల లోపు విద్యార్థులకు భక్తి గీతాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885790942 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళల రక్షణ కోసం మహిళ - మీకోసం



లక్ష్మీపురం: మహిళలకు సమస్యలు ఉంటే తక్షణమే మహిళల రక్షణ కోసం ' మహిళ-మీకోసం' 112, 974641464 నంబర్లకు సమాచారం తెలియజేయాలని అరండల్‌పేట పోలీసులు తెలిపారు. మంగళవారం అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ జయరామ్‌ప్రసాద్ ఆదేశాలతో అరండల్‌పేట పోలీసు స్టేషన్ సీఐ వీరాస్వామి పోలీసు స్టేషన్ పరిధిలోని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే 112, మహిళ - మీకోసం నంబరుకు సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

కరాటేలో కార్తీక్ రెడ్డికి నాలుగు పతకాలు



లక్ష్మీపురం: సౌత్ ఆఫ్రికాలోని దర్బన్ వేదికగా నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1 వరకు జరిగిన కామన్ వెల్త్ కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అరబండి కార్తీక్ రెడ్డి నాలుగు పతకాలు గెలుచుకొని, అంతర్జాతీయ వేదికలపై తెలుగు వారి ఖ్యాతిని నిలబెట్టాడు. ఈ మెగా ఈవెంట్‌లో ఎలైట్, క్లబ్ కేటగిరీలలో వేర్వేరు విభాగాల్లో పోటీపడిన కార్తీక్ రెడ్డి బంగారం, రజిత (రెండు), కాంస్య పతకాలు కైవసం చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించాడు. తన ప్రతిభతో దేశాన్ని గర్వపడేలా చేసిన కార్తీక్ రెడ్డి భారత్ కరాటే కు గొప్ప పేరు తీసుకువచ్చాడని భారత కరాటే హెడ్ కోచ్ కొంద్రు కీర్తన్ ఈ సందర్భంగా ప్రశంసల వర్షం కురిపించాడు. అత్యుత్తమ నైపుణ్యాలతో పాటు క్రీడ పట్ల అంకితభావం కలిగి ఉన్నందుకే కార్తీక్ రెడ్డికి ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన కొనియాడారు. ఈ కామన్ వెల్త్ కరాటే చాంపియన్ షిప్ పదకొండవ ఎడిషన్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించి నాలుగు పతకాలతో మెరవడం పట్ల నిర్వాహకులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొత్తం 15 మంది క్రీడాకారులు ఈ కరాటే ఈవెంట్ లో పాల్గొనగా, వారిలో కార్తీక్ రెడ్డి కి మాత్రమే నాలుగు పతకాలు లభించటం విశేషం. తన కుమారుడు అంతర్జాతీయ వేదికలపై రాణించడం పట్ల తండ్రి సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ ఎ.చంద్రశేఖర రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కలయిక... నిజమే ఇక!

ఆధునిక వైద్యంతో కృత్రిమ గర్భధారణ సులభం



జీవన శైలితో పెరిగిన సంతాన లేమి సమస్యలు

అవగాహన పెంచుకుంటే తొలగనున్న అడ్డంకులు

గుంటూరు మెడికల్: చాలా యువ జంటలు సంతాన లేమితో ఇబ్బంది పడుతున్నారు. కారణాలు సకాలంలో గుర్తించి ఆధునిక వైద్యం అందిస్తే సంతానం పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. వివాహమై ఏడాది గడిచినా సంతానం లేకుంటే ఆలస్యం చేయకుండా సంతాన సాఫల్య నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నారు. జిల్లాలో 300 మంది గైనకాలజిస్టులు ఉండగా, సంతాన లేమికి 60 మంది వరకు చికిత్స చేస్తున్నారు. వీరి వద్దకు రోజూ ఒకరు లేదా ఇద్దరు వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లోనూ రోజూ ఐదు నుంచి పది మంది ఈ సమస్యతో వస్తున్నట్లు వైద్యులు చెప్పారు.

అనేక కారణాలు...

మహిళల్లో సంతాన లేమికి పలు కారణాలు ఉన్నాయి. వాటిలో ఆలస్యంగా రజస్వల కావటం, పెద్ద వయస్సు అంటే 35 ఏళ్లు, ఆపై వయస్సులో పెళ్లి, అండం విడుదల కాకపోవటం, హార్మోన్ల సమస్య, గర్భసంచి, కడుపులో ఇన్‌ఫెక్షన్లు, గర్భసంచి ట్యూబ్‌లు మూసుకుపోవటం, పీసీఓడీ, జునైటైల్ టీబీ, బీపీ, షుగర్, జీవనశైలి, అధిక మానసిక ఒత్తిడి, ఊబకాయం, అండం విడుదల జరిగే సమయంలో దాంపత్యంలో పాల్గొనకపోవటం, మూఢనమ్మకాలు, సెక్స్‌పై **అవగాహన** లేకపోవటం ఉన్నాయి. పురుషుల్లోనూ బీపీ, షుగర్, ధూమపానం, మద్యపానం, మత్తు పదార్థాలు, కొన్ని రకాల మందుల వాడకం, సుఖవ్యాధులు, టీబీ, బీర్జాలకు దెబ్బలు తగలటం, అంగం పరిమాణంలో తేడాలు, పని ఒత్తిడి, కంప్యూటర్‌పై ఎక్కువ సమయం పనిచేయడం, రాత్రివేళల్లో ఎక్కువగా సెల్‌ఫోన్ మాట్లాడటం, వీర్యకణాలు తక్కువగా ఉండటం, తక్కువ సమయం నిద్రపోవడం, గర్భనిరోధక సాధనాలు ఎక్కువగా వాడటం వల్ల సమస్యలు వస్తున్నాయి.

ఆధునిక చికిత్సలతో సంతానం

ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) విధానంలో భార్య అండాన్ని, భర్త శుక్రకణాల్ని ఇంక్యుబేటర్‌లో పెట్టి రెండు - ఐదు రోజుల్లో పిండం తయారయ్యాక ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో పెడతారు. భర్త శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇక్సీ విధానం ద్వారా, సంఖ్య జీరో అయితే టీసా పద్ధతి ద్వారా బీర్జాల్లో నుండి సిరంజి ద్వారా వీర్యకణాలు తీసి ఫలదీకరణం చెందేలా చూస్తారు. ఇంట్రా యుటైన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ) విధానంలో భర్త శుక్రకణాలు తీసి ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో ప్రవేశపెడతారు. భార్య గర్భసంచి పిండాన్ని మోసే స్థితిలో లేకపోయినా, ఆమె ఆరోగ్యరీత్యా గర్భం రాకూడదని వైద్యులు నిర్ధారిస్తే సరోగసీ (అద్దె గర్భం) ద్వారా సంతానం పొందవచ్చు.

అందుబాటులో ఆధునిక వైద్యం



నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. గుంటూరులో అందరికీ అందుబాటులోకి వీటిని తీసుకొచ్చాం. ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టేందుకు 23 - 28 ఏళ్ల వయస్సు చాలా అనుకూలం. గర్భం దాల్చేందుకు ముందుగానే ఫోలిక్ యాసిడ్ తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

– డాక్టర్ షమా సుల్తానా, ఐవీఎఫ్ నిపుణురాలు

గర్భం దాల్చగానే పరీక్షలు చేయించాలి



గర్భం దాల్చిన 13 వారాలలోపు న్యూకల్ ట్రాన్స్‌ల్యూసెన్సీ (ఎన్‌టీ) స్కాన్ చేయించాలి. డబుల్ మార్కర్, క్రోమోజోన్ ఎనాలసిస్, షుగర్, రక్తహీనత టెస్ట్‌లు చేయించాలి. 18 వారాల నుంచి ఐరన్ మాత్రలు, ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రలు, మూడు, ఐదు నెలల్లో టీటీ ఇంజెక్షన్లు తీసుకోవాలి. గర్భం దాల్చిన 20 నుండి 22 వారాల్లోగా టీఫా స్కాన్ చేయిస్తే గర్భంలో ఉండే బిడ్డ గుండె, తల, శరీరం, ఎముకల్లో ఎదుగుదల లోపాలను తెలుసుకోవచ్చు. 24 వారాల తరువాత బీపీ, షుగర్ పరీక్షలు చేయించాలి. 32 వారాలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్, పెట్ స్కానింగ్, సీటీజీ స్కాన్ చేయించాలి.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు

సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తాం



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నగర పాలక సంస్థ కమిటీ నాయకులు మేయర్‌ను సంపత్ నగర్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సెమి క్రిస్టమస్ వేడుకలు నిర్వహించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారని, అలాగే ఈ సంవత్సరం కూడా వేడుకల నిర్వహణకు నగర పాలక సంస్థ అధికారులతో కమిటీ వేసి, సదరు కమిటీలో తమ యూనియన్ నాయకులను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. స్పందించిన మేయర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గ్రాండ్‌గా నిర్వహిస్తామన్నారు. ప్రతి సంవత్సరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నామని, అదే తరహాలో ఈ సంవత్సరం కూడ సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ సదరు కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఈదులమూడి మధుబాబు, విలియమ్స్, యాకోబు, రామయ్య, ఏసుబాబు, చంద్రశేఖర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పీఎంఏవై డిమాండ్ సర్వే సత్వరమే పూర్తి చేయాలి

జీఎంసీ అదనపు కమిషనర్ సీహెచ్.ఓబులేసు



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎమినిటి కార్యదర్శులు పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వేని వేగంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్.ఓబులేసు ఆదేశించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరంలో పీఎంఏవై 2.0 డిమాండ్ సర్వేపై మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఎమినిటి కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రుణాలు అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉన్నాయన్నారు. అందులో భాగంగా పీఎంఏవై డిమాండ్ సర్వేని నగరంలోని ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో ఈ నెల 7వ తేదీ లోపు పూర్తి చేయాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. పీఎంఏవై 2.0లో రూ.3 లక్షల వార్షిక ఆదాయం కలిగి దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నవారిలో గతంలో ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం పొంది, ఇంటి నిర్మాణానికి లోన్ తీసుకోని వారికి, స్వంత స్థలం ఉండి ఎటువంటి గృహ నిర్మాణ లోన్ పొందని వారు అర్హులన్నారు. అలాగే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి నివాస స్థలం లేదా ఇల్లు పొందని వారు కూడా పీఎంఏవై 2.0కు అర్హులన్నారు. ఎమినిటి కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి పీఎంఏవై వెబ్ సైట్‌లో వివరాలను అప్ లోడ్ చేయడం ద్వారా రాష్ట్రానికి, పీఎంఏవై 2.0 లో గృహాలు, ఇంటి లోన్‌లు మంజూరు అవుతాయని, శనివారం నాటికి సర్వే పూర్తి కావాలని ఆదేశించారు. అనంతరం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సర్వేపై సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో అదనపు కమిషనర్ మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని ప్రతి వీధిలో ఉన్న ప్రతి పరిశ్రమ వివరాలు సేకరించి సర్వే అండ్ సపోర్ట్ యాప్‌లో అప్ లోడ్ చేయాలన్నారు. చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, అందులో పని చేసే కార్మికుల సంక్షేమ పథకాలు అందించేందుకు సర్వే దోహద పడుతుందన్నారు. ఇప్పటికే వార్డ్ సచివాలయాల వారీగా కమర్షియల్ అవసరాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకున్న వివరాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శంకర్రావు, డీఈఈలు ప్రసాద్, సత్యనారాయణ, ఇండస్ట్రీయల్ ప్రమోషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో నేత్ర వైద్య శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆప్టోకేర్ నేత్ర వైద్యశాలకు చెందిన సీనియర్ కన్సల్టెంట్ బీవీ లక్ష్మి పాల్గొని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా బీవీ లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ అధిక వినియోగం కారణంగా పెద్దలు, చిన్నారులు నేత్ర సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. రోజులో అధిక సమయం స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, కంప్యూటర్ వంటి పరికరాలను వినియోగించడంతో దాని ప్రభావం నేత్రాలపై పడి, కళ్లు మంటలు, తలనొప్పికి గురవుతున్నారని వివరించారు. స్క్రీన్ టైమింగ్ సమయాన్ని తగ్గించడం, విటమిన్ ఏ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా నేత్రాలను ఆరోగ్యంగా ఉంచుకోగలరని తెలిపారు. ఆర్నెల్లకోసారి నేత్ర పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి జేవీ సుదీర్‌కుమార్, ఆర్. జయశైలజ, జి. సురేష్ కుమార్, ఎన్ఎస్ఎ వలంటీర్లు పాల్గొన్నారు.

జైపూర్‌లో జీఎంసీ అధికారుల పర్యటన

రహదారుల నిర్వహణ, పారిశుద్ధ్య పనుల పరిశీలన



జైపూర్ కార్పొరేషన్‌లో అమలు చేస్తున్న విధానాలను నగర కమిషనర్‌కు వివరిస్తున్న జైపూర్ కార్పొరేషన్ అధికారులు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ స్టడీ టూర్‌లో భాగంగా 2వ రోజైన మంగళవారం గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు జైపూర్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రుక్మిణి రియార్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జైపూర్‌లో రోడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, హోర్డింగ్స్ పాలసీ, కేబుల్ వైర్ల తొలగింపు, డంప్ యార్డ్‌లను పార్క్‌లుగా అభివృద్ధి చేయడం వంటి పలు అంశాలను చర్చించారు. అనంతరం కమిషనర్ బృందం జైపూర్ నగరంలో క్షేత్ర స్థాయిలో వివిధ వార్డులను నేరుగా పరిశీలించి, స్థానికులు అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు నేరుగా తడి పొడి వ్యర్థాలను వేరు చేసి మున్సిపల్ కార్మికులకు అందించడం, ఒక ఈ ఆటో ద్వారా సుమారు 8 వందల ఇళ్ల నుంచి వ్యర్థాలను సేకరించడం పరిశీలించారు. కమ్యూనిటీ కంపోస్టింగ్‌లో భాగంగా స్థానికులు ప్రతాప్ అగర్వాల్ మట్టి కుండల ద్వారా మట్కా కంపోస్టింగ్ చేసే విధానాన్ని పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. సులభ్ కాంప్లెక్స్ నిర్వహిస్తున్న పబ్లిక్ టాయ్‌లెట్స్‌ని పరిశీలించి చాలా పరిశుభ్రంగా నిర్వహించడం, అందులో శానిటరీ న్యాప్ కిన్స్ వెండింగ్ మెషిన్ ఉండడం, ఉపయోగించిన న్యాప్ కిన్లను దహనం చేయడానికి యంత్రాలను పరిశీలించారు. జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహిస్తున్న మసాలా చౌక్, ఫుడ్ కోర్ట్‌లను పరిశీలించి, అక్కడి పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై సిబ్బందిని ప్రశంసించారు. జైపూర్ సన్ రైజ్ స్త్రీ స్వయం సహాయక సభ్యుల ద్వారా నిర్వహించే పశువుల సంరక్షణ పాయింట్, సహజ సౌందర్య సేంద్రీయ ఉత్పత్తులు, మార్కెటింగ్ విధానాన్ని పరిశీలించారు.

కృష్ణనగర్ దేవాలయంలో చోరీ

లక్ష్మీపురం: స్థానిక కృష్ణ నగర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో చోరీ జరిగింది. అర్ధరాత్రి ఆలయ తాళాలు పగులగొట్టి అమ్మవారి ముక్కుపుడక, హుండీలోని రూ. 5వేలు నగదు చోరి చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక కృష్ణనగర్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తి మాస్క్ ధరించి గేటు తాళాలు పగులగొట్టి దేవాలయంలోకి ప్రవేశించారు. దేవాలయంలో అమ్మవారి ముక్కుపుడక, ఒక గ్రాము బంగారంతోపాటు, హుండీలో ఉన్న రూ. 5వేలు నగదు చోరీ చేసి పరారయ్యాడు. మంగళవారం ఉదయం దేవాలయానికి వచ్చిన దేవాలయ నిర్వాహకులు గమనించి పట్టాభిపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం పలు కీలక ఆధారాలు సేకరించారు. దేవాలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతో పాటు నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులతో రామకృష్ణప్రభు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పోటీ ప్రపంచంలో రాణించేందుకు విద్యతో పాటు నైపుణ్యాలు ఎంతో కీలకమని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో మంగళవారం మ్యాజిక్‌బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్య శిక్షణా కార్యక్రమం ముగిసిన సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ నైపుణ్యాలను పెంపొందించుకున్న విద్యార్థులు ఉద్యోగాలను అందిపుచ్చుకోగలరని అన్నారు. మ్యాజిక్‌బస్ ఫౌండేషన్ అంతర్జాతీయస్థాయిలో మూడువేలకు పైగా శాఖలు కలిగి, విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని తెలిపారు. కమిటీ సభ్యుడు కర్పూరపు సూర్యనారాయణ మాట్లాడుతూ సదాశయంతో పని చేస్తున్న మ్యాజిక్‌బస్ శిక్షణ లక్ష్యాలుగా ఇంటర్వ్యూ, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు కెరీర్ ప్లానింగ్, వర్క్ ఎథిక్స్ క్షుణ్ణంగా నేర్చుకుని భవిష్యత్తులో రాణించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్ష్యంపై మక్కువ పెంచుకుని, ఆ దిశగా కృషి చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ప్రతినిధులు పుష్పలత, దిలీప్, కళాశాల అధ్యాపకులు చంద్రశేఖర్, మధుసూదన్‌రావు, మల్లేశ్వరి, రాజరాజేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

ట్యాలీప్రైమ్, జీఎస్టీ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ ప్రైమ్, జీఎస్టీ, అడ్వాన్స్ ఎక్సెల్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధి హరిప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీకాం, ఎంకాంలో ఉత్తీర్ణులై 20 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు విజయవాడలో 60 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీప్రైమ్ ప్లస్, జీఎస్టీ ప్లస్ అడ్వాన్స్ ఎక్సెల్, స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం సర్టిఫికెట్‌తో పాటు వివిధ ఫైనాన్స్, అకౌంటింగ్ సంస్థల్లో నెలకు రూ.18వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు, కూలీలకు ప్రయోజనం


సమరసత సంస్థ జాతీయ అధ్యక్షుడు శ్యాంప్రసాద్



ప్రసంగిస్తున్న శ్యాంప్రసాద్

ఏఎన్‌యూ: ప్రస్తుతం వ్యవసాయ రంగంలో రైతులు, రైతు కూలీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రకృతి వ్యవసాయం అనుసరించడం ద్వారా వాటిని అధికమించ్చవచ్చని సమరసత సంస్థ జాతీయ అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో మంగళవారం 'వ్యవసాయ కూలీల సామాజిక, ఆర్థిక సాధికారిత' అనే అంశంపై జరిగిన సదస్సులో శ్యాంప్రసాద్ కీలకోపన్యాసం చేస్తూ పూర్వం రైతులు అనేకరకాల పంటలు పండించి వస్తు మార్పిడి పద్ధతి ద్వారా పంపిణీ చేసుకునేవారన్నారు. శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి వ్యవసాయం లబ్ధి చేకూరుతుందని తెలిపారు. పండించిన పంటను గిట్టుబాటు ధరకు విక్రయించేలా చర్యలు చేపడితే దళారి వ్యవస్థను రూపుమాపవచ్చన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, పలువురు రైతులు ప్రసంగించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, అధ్యాపకులు ఆచార్య వై అశోక్ కుమార్, డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ వెలుగు జాడ- అడుగు జాడ



లక్ష్మీపురం: కవిగా, రచయితగా, బోధకుడుగా, కార్య నిర్వాహకుడుగా, చరిత్ర పరిశోధకుడుగా, విద్యావేత్తగా, విమర్శకుడిగా ఎన్నో బాధ్యతలు నిర్వహించిన బహుముఖ ప్రజ్ఞాశాలి గురజాడ అప్పారావు అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, తెలుగు పండితులు రాజన్న మస్టార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురజాడ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ తన జీవితకాలంలో అనల్పమైన దార్శనికతతో కాలాన్ని ముందుకు నడిపిన ప్రతిభా మూర్తి, చరిత్రలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవడమే కాదు, తనతోనే నూతన చరిత్ర మొదలైందనిపించుకున్న అసమాన మేధావి గురజాడ అప్పారావు అని అన్నారు. మరణించి వందేళ్ళు గడిచినా తెలుగువారి హృదయాలలో శాశ్వతంగా జీవిస్తున్న ధన్యుడు, తెలుగు భాషను సాహిత్యాన్ని కూడా అజరామరం చేసి ప్రజలకే అందించిన ప్రజాస్వామ్య ప్రియుడు గురజాడ అన్నారు. కవి జమదగ్ని, రచయిత్రి భాగ్యలక్ష్మీ, సాహితీవేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు తదితరులు నివాళులర్పించి, ప్రసంగించారు.

దివ్యాంగుల ప్రతిభను గుర్తించాలి



పిల్లలతో లీలావతి

నగరంపాలెం: దివ్యాంగ పిల్లల్లో దాగిన ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాజాగారితోటలోని భవిత స్కూల్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులతో కార్యదర్శి లీలావతి మాట్లాడారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం, చదువుపై ఆరాతీశారు. విద్యార్థుల్లో ప్రతిభను ఓర్పుతో గుర్తించి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా, వారికి భోజనం వడ్డించారు. సదస్సులో ఎంఈఓలు ఖుద్దూస్, జ్యోతి, ప్రిన్సిపల్ గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు రాజేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యతోనే విజ్ఞానం అలవడుతుంది

ప్రత్తిపాడు: విద్యతోనే విజ్ఞానం, వివేకం అలవరుతాయని ఐసీడీఎస్ గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి. మాధవి అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాతమల్లాయపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్య లేకపోవడం వలన కలిగే అనర్థాలు, విద్య వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ మాధవి మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. చదువు మధ్యలో ఆపివేసి బాల్యవివాహాలు చేయడం వలన శారీరకంగా, మానసికంగా సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె. వెంకట నారాయణ, అంగన్‌వాడీ కార్యకర్త వై. యమున పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ [illegible] గుంటూరు [illegible] లిమిటెడ్, [illegible] శ్రీ ఘంటా కోటేశ్వరరావు గారి భార్య శ్రీమతి ఘంటా విజయలక్ష్మి గారు [illegible] ది. 17-5-1984 న [illegible] లక్ష్మీ దేవి గారి [illegible] క్రయం పొంది [illegible] గుంటూరు జిల్లా [illegible] ద.నెం. 5657/1984 గా [illegible] వారి భర్త ఘంటా కోటేశ్వరరావు గారు 11-08-2009లో మరణించినారు. [illegible] కిరణ్ కుమార్ గారు [illegible] ది. 13-12-2021 న ఘంటా కిరణ్ కుమార్ గారు శ్రీ [illegible] శ్రీ కూరాకుల పెద శ్రీనివాసరావుగారికి [illegible] ద.నెం. 6035/2021గా రిజిష్టర్ చేసి [illegible] శ్రీ కూరాకుల పెద శ్రీనివాసరావు గారు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వారి నుండి ప్లాన్ అప్రూవల్ పొంది "ద్వారకా రెసిడెన్సీ" అను అపార్టుమెంట్ నిర్మించియున్నారు. [illegible] ది. 3-4-2024న విక్రయ అగ్రిమెంట్‌ను వ్రాసియున్నారు. శ్రీమతి [illegible] నా క్లయింట్ అయిన బ్యాంక్ వారిని హోమ్ లోన్ కొరకు సంప్రదించగా [illegible] 5657/1984 [illegible] ద.నెం. 5657/1984కు సంబంధించి [illegible] నా క్లయింట్ బ్యాంక్ వారికి గాని ఈ ప్రకటన జారీ అయిన నాటి నుండి 7 రోజులలో లిఖిత పూర్వకముగా తెలియజేయగలరు. [illegible] నా క్లయింట్ [illegible]

షెడ్యూలు

గుంటూరు డి., కొరిటిపాడు సబ్ డి. [illegible] గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ [illegible] కొరిటిపాడు గ్రామం [illegible] 1 [illegible] బ్లాక్ నెం. 11రు, డోర్ నెం.11-[illegible] చ.గ.298 [illegible] చ.గ.11.11లు పోను మిగిలిన చ.గ. 286.89 యందలి "ద్వారకా రెసిడెన్సీ" అపార్టుమెంట్‌నకు హద్దులు: తూర్పు: అ.25లు వెడల్పు గల రోడ్డు హద్దు, దక్షిణం: అ.30లు వెడల్పు గల రోడ్డు హద్దు, [illegible] ఉత్తరం: [illegible] ఈ హద్దుల మధ్య చ.గ. 286.89లు స్థలములో నిర్మించిన "ద్వారకా రెసిడెన్సీ" అపార్టుమెంట్ సెకండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నం. 233

జొన్నలగడ్డ చంద్రశేఖర్, అడ్వకేట్
డోర్ నెం.1-15-38/2బి, [illegible] కాలని, 1వ లైను
గుంటూరు, సెల్: 9849797079